సాక్షి నంద్యాల
బుధవారం । 29 । మార్చి । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.



కొబ్బరి కాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: వచ్చేనెల 11న నిర్వహించే శ్రీశైల భ్రమరాంబాదేవి కుంభోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	23.5
గరిష్టం	39.6

న్యూస్‌రీల్

ముగిసిన చౌడేశ్వరిదేవి జ్యోతి బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలతో వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్: ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమైన నందవరం చౌడేశ్వరి దేవి జ్యోతి బ్రహ్మోత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయ ఈఓ రామానుజన్, అర్చలకు ఆధ్వర్యంలో ఉదయం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా రంగులు చల్లుకుంటూ చౌడేశ్వరిదేవి ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో భక్తులు ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ దేవస్థానం సమీపంలోని శ్రీ చౌడమ్మ కోనేరు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఉత్సవ విగ్రహాలను కోనేటి నీటితో శుభ్రం చేసి మళ్లీ ఆయా దేవస్థానాలకు చేర్చి ఉత్సవాలను ముగించారు.

డిగ్రీ పరీక్షలకు 1240 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలకు మంగళవారం 1240 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ మొదటి, మూడు, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 13,896 మందికి 12,656 మంది హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ తెలిపారు. ఎమ్మిగనూరు రావూస్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు, కర్నూలు కర్నూలు డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నంద్యాల పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల, జోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 9 మంది విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

ఉపాధి వేతనం పెంపు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీల వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉపాధి వేతనం గరిష్టంగా రూ.257 ఉంది. తాజాగా రూ.15 పెంచడం విశేషం. పెంపుదల వల్ల ఉపాధి కూలీల గరిష్ట వేతనం రూ.272కు చేరింది. ఏప్రిల్ 1 నుంచి పెరిగిన వేతనం అమలులోకి వస్తుంది. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గరిష్ట వేతనం పొందడానికి ఉదయం, సాయంత్రం కూడా పనులు చేసుకునే అవకాశాన్ని జిల్లా నీటియాజమాన్య సంస్థ కల్పించింది. ప్రస్తుతం ఉపాధి పనులకు రోజుకు 80వేల మంది వరకు హాజరవుతున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య లక్ష దాటే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎరువుల ప్రణాళికలు సిద్ధం చేయండి

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి అవసరమైన ఎరువులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఎరువుల కంపెనీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కర్నూలు సబ్ డివిజన్ కార్యాలయంలో కంపెనీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో డీఏఓ మాట్లాడుతూ... 2022–23 సంవత్సరానికి డిమాండ్‌కు తగ్గట్టుగా ఎరువులు సరఫరా చేశారని, అదే తరహాలోనే వచ్చే సంవత్సరంలో కూడా ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. ఇక నుంచి అన్ని కంపెనీలు, అన్ని రకాల ఎరువులను కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు భారత్ బ్రాండ్ పేరుతో సరఫరా చేయాలన్నారు. 100 శాతం ఎరువుల అమ్మకాలు ఈ-పాస్ ద్వారానే నిర్వహించాలన్నారు.



తొమ్మిది నెలలు.. ఓ మహిళ జీవితంలో మరపురాని కాలం. ఒక్కో నెల ఒక మధురానుభూతి. కనిపించని లోకంలో కదిలికలే ఆమె లోకం. వినిపించని అరుపులకు ఆ ముఖమే వికసించే నవ్వులు. వెన్ను విరిగే నొప్పులను భరిస్తుంది.. పురిట్లోని బిడ్డను చూసి ఆ బాధను దిగమింగుతుంది. అందరి జీవితం ఇలా ఉంటే.. ఆ తల్లి 'కడుపు కోత' మాటలకందని వెత. పెళ్లి చెడింది.. ప్రేమ అగాథమైంది. మోసానికి పుట్టిన పాప కళ్లు తెరవక మునుపే తల్లికి దూరమైంది.. కన్న పేగుకు దూరంగా 18 నెలల నుంచి అజ్ఞాతంలో పెరుగుతోంది. ఆ తల్లి ప్రేమించినోడి రాక్షసత్వానికి మౌనంగా రోదిస్తోంది.. ఊహకందని బిడ్డ రూపం మనసులో నిలుపుకొని న్యాయదేవత ఎదుట జీవచ్ఛవంగా మిగిలింది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

మోసం పేరు రాకేష్.. పాప పేరు 18 నెలలు!

ప్రేమపెళ్లి 'ముసుగు'

- ఓ యువతి జీవితంలో చీకటి
- నమ్మించి మోసగించిన జూనియర్ అసిస్టెంట్
- బిడ్డ పుట్టిన తర్వాత మరొకరితో వివాహం
- ప్రశ్నించడంతో దారుణంగా దాడి
- పురిట్లోనే పసికందు మాయం
- ఒంటరి పోరాటం చేస్తున్న గాయత్రి

హాలహర్వికి చెందిన గాయత్రి అదే మండలంలోని ఓ సచివాలయంలో ఉద్యోగం చేస్తోంది. చిన్న వయస్సులోనే జీవితంలో స్థిరపడే అవకాశం రావడంతో పెళ్లి చేసుకొని హాయిగా బతికేద్దాం అని అందరి అమ్మాయిల్లానే ఎన్నో కలలు కనింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చెందిన ఓ యువకునితో సంబంధం కుదర్చగా.. నిశ్చితార్థం పూర్తయింది. అయితే విధి నిర్వహణలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాకేష్ ఈమెతో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే అతను ప్రేమిస్తున్నట్లు చెప్పడంతో తనకు అప్పటికే నిశ్చితార్థమైన విషయాన్ని బయటపెట్టి దాటవేసింది. ఇలా.. ఆమె మెడలో మూడు ముళ్లు పడినా, ఆ వివాహం ఊహించని గొడవలతో ఐదు రోజులకే పరిమితమైంది. తిరిగి కార్యాలయానికి చేరుకోగానే ఏం జరిగిందని రాకేష్ ఆమెను ఆరా తీయడంతో జరిగిన విషయాన్ని వివరించింది. "నా ప్రేమ స్వచ్ఛమైంది.. దేవుడు నిన్ను నాతో కలిపేందుకే ఈ పెళ్లి పెటాకులు చేశాడు' అనే మాయ మాటలతో కన్నీరు కార్చడంతో పాటు పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చాడు. జీవితం ముళ్లబాటగా మారిన పరిస్థితుల్లో అతని నయవంచనను గుర్తించలేక సరేనంది. ఇరువురి కులాలు వేరు కావడం, కుటుంబ సభ్యులకు తెలిస్తే ఒప్పుకోరనే భావనతో కర్నూలు చిన్న పార్కు సమీపంలోని మేరిమాత చర్చి వద్ద గాయత్రి మెడలో తాళి కట్టి కాపురం పెట్టారు.

మరో యువతితో వివాహం

రాకేష్ స్వస్థలం ఆదోని. అక్కడ మరో ప్రభుత్వ ఉద్యోగిని లక్ష్మిని కూడా ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇంతలో విషయం తెలుసుకున్న గాయత్రి అక్కడికి వెళ్లి గొడవ చేసింది. అయినప్పటికీ నెల తిరక్కుండానే ఇరువురి కులాలు ఒక్కటి కావడంతో అతను లక్ష్మి పెళ్లి చేసుకోగా.. దిక్కుతోచని గాయత్రి కర్నూలు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎందుకు ఇలా చేశావని అతడిని ప్రశ్నించేందుకు ఆదోనికి వెళ్లగా తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు.

కళ్లు తెరిచి చూస్తే..

ఆ ప్రేమ, పెళ్లికి తీపిగుర్తుగా గర్భం దాల్చడం, కర్నూలులోని అపెక్స్ ఆసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనివ్వడం జరిగిపోయింది. కళ్లు తెరిచి చూసేసరికి బిడ్డలేదు. ఎక్కడని ప్రశ్నిస్తే అనారోగ్యంగా ఉండటంతో పెద్దాసుపత్రిలో చేర్పించానన్నాడు. నమ్మింది.. డిశ్చార్జ్ తర్వాత కూడా బిడ్డ తన ఒడి చేరకపోవడంతో మరోసారి ఆరాతీసింది. నీకు ఆరోగ్యం బాగోలేదు కదా, బంధువుల వద్ద ఉంచానన్నాడు. పాలు ఎలాగంటే, మరొకరితో ఇప్పిస్తున్నాం.. ఎలాంటి ఇబ్బంది లేదన్నాడు. చివరికి ఎలాగో ఆ పాపను అనంతపురం జిల్లా రాయదుర్గంలో పిల్లలు లేని తన సమీప బంధువులకు అప్పగించినట్లు విషయం బయటపడింది. ఈ విషయమై నిలదీయడంతో ఇద్దరి మధ్య దూరం పెరిగింది.

డీఎన్‌ఏ పరీక్షలతో..



కేసు నమోదు చేసిన పోలీసులు పనిచేస్తున్న ప్రాంతం.. కలిసి ఉన్న ఇల్లు.. డెలివరీ జరిగిన ఆసుపత్రి.. తదితర ప్రాంతాల్లో విచారించి కేసును ఓ కొలిక్కి తీసుకొచ్చారు. అప్పుడు రాకేష్ ఆ బిడ్డతో తనకు ఎలాంటి సంబంధం లేదని బుకాయించాడు. విధిలేని పరిస్థితుల్లో పోలీసులు డీఎన్‌ఏ పరీక్షలు చేయించగా.. వాస్తవం తేలింది. ఈ నేపథ్యంలో బిడ్డను తనకు అప్పగించాలని గాయత్రి కలెక్టర్, ఎస్పీ, డీజీపీ, మహిళా కమిషన్, దిశ పోలీసుస్టేషన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలతో పాటు ఎన్నో మెట్లు ఎక్కింది, దిగింది.

ఒంటరి పోరాటం

బిడ్డ కోసం గాయత్రి చివరి అస్త్రంగా హైకోర్టును ఆశ్రయించి 'హెబియస్ కార్పస్'(బిడ్డ కన్పించడం లేదు) పిటిషన్ వేసింది. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు రాయదుర్గంలోని అన్నపూర్ణ, కళ్యాణ్‌కృష్ణ వద్ద పెరుగుతున్న బిడ్డను స్వాధీనం చేసుకున్నారు. కోర్టు తీర్పు ఆధారంగా బిడ్డను అప్పగిస్తామని చెప్పారు. డీఎన్‌ఏ టెస్ట్ ద్వారా పోలీసులు రాకేశ్‌కు పుట్టిన బిడ్డే అని తేల్చడంతో అతను కూడా కోర్టులో అదే విషయాన్ని అంగీకరించాడు. చివరకు కోర్టు నిర్ణయం తీసుకునే సమయంలో బిడ్డను ఇన్నిరోజులు పెంచిన కళ్యాణ్‌కృష్ణ, అన్నపూర్ణ దంపతులు కూడా కోర్టులో సోమవారం(ఈ నెల 27న) తమ బిడ్డ కనిపించడం లేదని 'హెబియస్ కార్పస్' పిటిషన్ వేశారు. ఇదిలాఉంటే తన వల్ల తల్లిదండ్రులకు మచ్చ రాకూడదనే ఉద్దేశంతో గాయత్రి ఒంటరి పోరాటం చేస్తోంది.

నాకిక బిడ్డే లోకం

ప్రేమ పేరిట వెంటపడ్డాడు. పెళ్లి చేసుకున్నాక కలిసి ఉన్నన్ని రోజులు నా జీతంతోనే గడిపాడు. బంగారం కూడా తీసేసుకున్నాడు. బిడ్డ పుట్టిన తర్వాత అసలు రూపం బయటపడింది. పాపను కళ్లారా చూసుకునే అవకాశం లేకుండా పురిట్లోనే మాయం చేశాడు. ఇప్పుడు పాపకు 18 నెలలు. కనీసం పేరు పెట్టే అవకాశం కూడా లేకుండాపోయింది. బిడ్డ లేకపోయింటే నా ఖర్మ ఇంతేలే అనుకునేదాన్ని. ఇప్పుడు సమాజం నన్ను వేలెత్తి చూపుతోంది. అన్నింటినీ భరించి నా బిడ్డ కోసం బతుకుతున్నా. పాప కోసమే పోరాటం చేస్తున్నా.

– గాయత్రి, బాధితురాలు

కేసు కోర్టు పరిధిలో ఉంది

గాయత్రికి జరిగిన అన్యాయంపై కేసు నమోదు చేశాం. డీఎన్‌ఏ టెస్ట్‌లో రాకేశ్, గాయత్రిలకు పాప పుట్టిన విషయం తేలింది. ఆ తర్వాత పాప కోసం ఆమె కోర్టును ఆశ్రయించింది. కేసు కోర్టులో నడుస్తోంది. త్వరలోనే జడ్జిమెంట్ వస్తుంది.

– మహ్మద్ తబ్రేజ్, సీఐ, త్రీటౌన్

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పార్టీ, కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి చేకూరిందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బత్తులూరుపాడులో రూ.5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్, యనకండ్ల గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ ఓపెన్ డ్రైవ్ విత్‌కవర్ స్లాట్, రూ.8 లక్షలతో నిర్మించిన మినరల్‌వాటర్ ప్లాంట్, రూ.23.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, అక్రమార్జన కోసం నీరు చెట్టు పేరుతో దోపిడీకి పాల్పడ్డారన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులు పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. ఎర్రబోతుల కుటుంబాన్ని విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి లేదన్నారు. కమీషన్ల కోసం సిమెంట్ కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేసే వ్యక్తి బీసీ అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే శిల్పా రవి



స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కును ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి

నంద్యాల: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో నంద్యాల నియోజకవర్గ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు మహిళలకు అందజేశారు. అనంతరం లబ్ధిపొందిన మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ నాడు టీడీపీ ప్రభుత్వం హయాంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాజీ సీఎం చంద్రబాబునాయుడు మహిళలను మోసం చేశారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా కింద అక్కచెల్లెమ్మల ఖాతాలో ఇప్పటి వరకు మూడు విడతల్లో 19 వేల కోట్ల రూపాయలు జమ చేశారన్నారు. నంద్యాల నియోజకవర్గంలో మూడో విడత రూరల్ పరిధిలో 2,001 స్వయం సహాయక గ్రూపులకు రూ.13.95 కోట్లు, మున్సిపాలిటీలో 2,419 స్వయం సహాయక గ్రూపులకు రూ.15.29 కోట్లు మొత్తం 29.24 కోట్లు మహిళల ఖాతాలో జమ అయ్యాయన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే మడమ తిప్పరన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని రంగాల్లో 50 శాతం పైగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం విశేషమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు చంద్రశేఖర్, సునీత అమృతరాజ్, శశికళారెడ్డి, జెడ్పీటీసీ గోకుల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.

రైతునగరంలో సచివాలయం ప్రారంభం..

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రైతునగరంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు రామసుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పొదుపు గ్రూపు మహిళలు

మళ్లీ సెకండియర్‌లో కలుద్దాం

- ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు

నంద్యాల (సిటీ): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 124 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 34,639 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1,260 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి వెల్లడించారు. 29 పరీక్షా కేంద్రాలను ఆర్ఐఓ, డీవీఈఓ, హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించామన్నారు. కర్నూలు నారాయణ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు, గోనెగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇద్దరు, వెల్దుర్తి జూనియర్ కళాశాల, కోవెలకుంట్ల ఏపీఎస్ డబ్ల్యూఆర్ జేసీ కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఏడుగురు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడడంతో డిబార్ చేసినట్లు ఆర్ఐఓ పేర్కొన్నారు. కాగా తొలి సంవత్సరం పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద సంతోషంతో కేరింతలు కొట్టారు. మళ్లీ సెకండ్ ఇయర్‌లో కలుసుకుందామంటూ స్నేహితులకు బైబై చెప్పుకున్నారు.



పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు



బస్సులో వెళ్తూ ఉత్సాహం వ్యక్తం చేస్తూ..

16న ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏపీ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జోన్-4 అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ జి. రాజేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి పాత కేంద్రాలు తొమ్మిదిని మినహాయించి కొత్తగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మరో 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ, బేతంచెర్ల, కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోని, కల్లూరు (రెండు), కర్నూలులో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. కొత్తగా గుర్తించిన ఈ కేంద్రాల్లో 1,810 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఏప్రిల్ 4వ తేదీ వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేకునేందుకు అవకాశం ఉందని, ఉమ్మడి జిల్లాలో అర్హులైన బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రామికుల సంక్షేమానికి కృషి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య
- ఘనంగా వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్) శ్రామికుల పక్షాన నిలిచి వారి సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని ఆ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు. మంగళవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్‌బీఐ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నంద్యాల చెక్‌పోస్టు వద్ద భారీ కేక్ కట్ చేసి ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలోని ఎస్ అనే పదానికి శ్రామిక అని అర్థం వస్తుందని పార్టీ ఆవిర్భావ సమయంలోనే శ్రమ జీవులకు అండగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ విధంగా పేరు పెట్టారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు ఏ సమస్య వచ్చినా అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, వైఎస్సార్ టీయూసీ కర్నూలు, నంద్యాల జోనల్ ఇన్‌చార్జ్ కిషన్, జిల్లా అధ్యక్షుడు భీమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు జుబేర్

పగిడ్యాల: ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోలేకపోతున్నాననే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం పడమర ప్రాతకోట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆటో ఖాజామియ్య కుమారుడు జుబేర్(23) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ ముస్లిం యువతిని ప్రేమించాడు. విషయం తల్లిదండ్రులకు తెలిసి నాలుగు రోజుల క్రితం మధ్యవర్తుల ద్వారా యువతి కుటుంబీకులను సంప్రదించారు. అయితే వారు ఒప్పుకోకపోవడంతో జుబేర్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి కుమారుడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబీకులు అర్ధరాత్రి వరకు గ్రామంలో గాలించారు. మంగళవారం తెల్లవారుజామున యువకుడి బాబాయ్ నమాజ్ చేయడానికి మసీదుకు వెళ్లి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి బాత్‌రూమ్ తలుపులు తెరిచాడు. అందులో జుబేర్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున ఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

శ్రీశైలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ఫిల్టర్‌బెడ్ సమీపంలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మతిస్థిమితం లేని వ్యక్తి మూడు రోజులుగా ఆ ప్రాంతంలో తిరుగుతూ అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఆచూకీ కోసం ప్రయత్నించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీంతో శానిటేషన్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని ఖననం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

బొమ్మలసత్రం: నంద్యాల మండలం కానాల గ్రామ శివారులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తాలూకా ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. కేసీ సబ్ కెనాల్‌లో స్థానికులకు మృతదేహం కనిపించింది. వెంటనే వారు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. మృతుడి కుడి చేతిపై రాజాకుమారి పేరుతో పచ్చబొట్టు ఉంది. వయస్సు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉంటుంది. వివరాల కోసం సెల్ : 8074153663 నంబరును సంప్రదించాలని కోరారు.

బ్యాటరీ వాహనం విరాళం


బ్యాటరీ వాహనాన్ని విరాళంగా అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మున్నంగి సామ్రాజ్యం శ్రీశైల దేవస్థానానికి రూ.6లక్షలు విలువ చేసే బ్యాటరీ వాహనాన్ని మంగళవారం విరాళంగా అందజేశారు. దాత మాట్లాడుతూ తన భర్త శంకరరెడ్డి జ్ఞాపకార్థం ఈ వాహనాన్ని అందజేసినట్లు తెలిపారు. తర్వాత బయలువీరభద్రస్వామి ఆలయం వద్ద ఆ వాహనానికి పూజలు నిర్వహించారు.

సంప్రదాయాన్ని ప్రతిధ్వనిస్తూ

తెల్లవారుజామున ఔటు వదలగానే ముస్లింలు ఉపవాస దీక్ష ప్రారంభిస్తారు. సాయంత్రం మరోసారి ఔటు పేలగానే దీక్ష విరమిస్తారు. సహెరీ, ఇఫ్తార్ వేళలను తెలియజేసే ఈ సంప్రదాయం కర్నూలు నగరంలో మొగల్ చక్రవర్తుల కాలంలో ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది.

- ఔటు ఆధారంగానే రంజాన్ ఇఫ్తార్, సహెరీలు
- నగరమంతా వినిపించేలా శబ్దం
- మొఘల్ కాలం నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ


కర్నూలు నగరంలో ఉస్మానియ కళాశాల ఆవరణలో ఔట్ పేల్చుతున్న దృశ్యం


ఔట్ పేలిన దృశ్యం

కర్నూలు (రాజ్‌విహార్): ముస్లింలకు అత్యంత పవిత్ర మాసం రంజాన్. భక్తి శ్రద్ధలతో 'అల్లాహ్'ను ఆరాధిస్తారు. ఎంతో నిష్ఠతో నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు పాటిస్తారు. దీక్ష స్వీకరణ, విరమణలో సమయ పాలన ఎంతో కీలకం. అయితే, మత పెద్దలు సూచించిన సహెరీ, ఇఫ్తార్ వేళలను తెలియజేసేందుకు పూర్వం మైకులు, సైరన్లు, గడియారాలు లేవు. దీంతో ఔటు పేల్చి శబ్దం చేసేవారు. ఈ శబ్దాన్ని ప్రతి ముస్లిం అనుసరించేవారు. కర్నూలు నగరంలో ఉస్మానియా కళాశాల వద్ద నుంచి నిర్వహించే ఈ ఔటు శబ్దం చుట్టూ ఐదు కిలో మీటర్ల వరకు వినిపిస్తుంది.

నేటికీ కొనసాగుతున్న సంప్రదాయం..

శతాబ్దాల క్రితం మన దేశాన్ని మొగల్ చక్రవర్తులు పాలించారు. అప్పట్లో మైకులు, సైరన్లు లేవు. దీంతో సహెరీ, ఇఫ్తార్ వేళల్లో ఔటు పేల్చి శబ్దం చేసేవారు. అలా కర్నూలులో కూడా నిర్వహిస్తూ వచ్చారు. రంజాన్‌కు ముందే ప్రభుత్వ ఖాజీ వీటి ఏర్పాట్లు చేస్తారు. ప్రతి ఏటా రంజాన్ మాసంలో 64 ఔట్లు పేల్చుతారు. సహెర్, ఇఫ్తార్‌లకు రెండు పూటలా 30 రోజులకు 60, రంజాన్ చంద్ర దర్శనం సమయంలో రెండు ఔట్లు, నెల ముగిశాక ఈదుల్ ఫితర్ పండుగ నమాజ్‌కు ప్రభుత్వ ఖాజీ ఇంటి నుంచి బయలుదేరే ముందు ఒకటి, నమాజు పూర్తయిన తర్వాత మరొకటి చొప్పున ఔట్లు పేలుస్తారు.

నగరంలో నిర్వహణ ఇలా..

గతంలో కర్నూలులోని ఓ కుటుంబానికి చెందిన వారే ఔటును పేల్చేవారు. పాతబస్తీకి చెందిన బి. ఖలీల్ అహ్మద్ ఔటును పేల్చే వృత్తి కొనసాగించారు. అయితే, కొన్ని కారణాలతో కర్నూలు ఖాజీ, హిలాల్ కమిటీ అధ్యక్షుడు సలీం సాహెబ్ గత మూడేళ్ల క్రితం గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన ఎస్. ఖాసీవలికి అప్పగించారు. దీంతో అప్పటి నుంచి ఆయన నిర్వహిస్తున్నారు.

సమయం కచ్చితంగా ఫాలో అవుతాం



రంజాన్ మాసంలో ఖాజీసాబ్ అనుమతితో ఔటు పేల్చే వృత్తిని మూడేళ్లుగా నిర్వహిస్తున్నా. దీని శబ్దం ఐదు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. అరగంట ముందే ఉస్మానియా కళాశాలకు చేరుకుని, ఇక్కడ భూమిలో ఉన్న మూడుడగుల నిలువు పైపులో మేము తయారు చేసుకున్న మందు సామగ్రిని పెట్టి అంటిస్తా. సమయం కచ్చితంగా ఫాలో అవుతా. ఔటు పేల్చేందుకు ముందు జాగ్రత్తలు తీసుకుంటాను.

– ఎస్. ఖాసీం వలి, నిర్వాహకుడు

ఔటు ఆధారంగానే రోజా



రంజాన్ ఉపవాసాలకు సమయం చాలా ముఖ్యం. ఒక్కొక్కరు ఒక్కో సమయం కాకుండా కర్నూలులో పేల్చే ఔటు ఆధారంగా అందరూ ఒకే సమయానికి సహెరి, ఇఫ్తార్ చేస్తారు. గడియారాల్లో వ్యత్యాసం ఉంటుంది కానీ, ఔటు శబ్దం కచ్చిత సమయానికి వినిపిస్తుంది.

– సయ్యద్ షాహ్ షఫీ పాషా ఖాద్రీ సాహెబ్, సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు

ఉపాధి కల్పనను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న హరికృష్ణ

నంద్యాల(రూరల్): ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఖాదీ బోర్డు డీడీ హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆ పథకంపై పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఖాదీ బోర్డు ఆధ్వర్యంలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గ్రామీణ పరిశ్రమ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పథకంలో 18 సంవత్సరాలు పైబడిన యువత చిన్న పరిశ్రమల ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వివిధ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తుందన్నారు. 8వ తరగతి వరకు చదివి ఉంటే చాలన్నారు. ఆసక్తి గల వారు గ్రామీణ పరిశ్రమల మండలి జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రాంతీయ అధికారి చంద్రశేఖర్, ఖాదీ బోర్డు జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజు, లలితమ్మ, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

వైకేపీ ఉద్యోగి ఆత్మహత్య


మాధవస్వామి (ఫైల్)

మిడుతూరు: వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. దేవనూరు గ్రామానికి చెందిన డాలు మాధవస్వామి (31) స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) కార్యాలయంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం కార్యాలయ ఆవరణలో జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల చెక్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత బైక్‌పై ఇంటికి బయలుదేరిన మాధవస్వామి మార్గమధ్యంలో వైకేపీ సిబ్బందికి ఫోన్ చేసి తాను సూసైడ్ చేసుకుంటున్నట్లు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించేలోపు దేవనూరు గ్రామానికి వెళ్లేదారిలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మాధవస్వామికి మూడేళ్ల క్రితమే వివాహమైంది. మరణవార్త తెలియగానే కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతికి గల కారణాలపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మారుతి శంకర్ తెలిపారు.

పెద్దాసుపత్రిలో జీవన్‌ధాన్ వైద్యనిపుణుల కమిటీ


ఆసుపత్రి అధికారులతో కమిటీ బృందం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం జీవన్‌ధాన్ వైద్యనిపుణుల కమిటీ సభ్యులు పర్యటించారు. ఇందులో జీవనదాన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రామ్, సభ్యులు డాక్టర్ అలోక్ సామంతరి, డాక్టర్ వినోద్‌ఖాన్, డాక్టర్ ఎస్. అనిల్‌కుమార్ ఉన్నారు. వీరు ఆసుపత్రిలోని యురాలజి, కార్డియోథొరాసిక్ ఆపరేషన్ థియేటర్లు పరిశీలించారు. లైవ్ దాత కిడ్నీ మార్పిడికి ఆసుపత్రిలో అనువుగా ఉందా, సరిపడా పడకలు ఉన్నాయా, వైద్యులు, సిబ్బంది ఉన్నారా అన్న వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఓటీల ఇన్‌ఫెక్షన్ కమిటీ పారామెడికల్ సిబ్బంది, ప్రత్యేక సేవలు, ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్‌బ్యాంక్, పరికరాలు, మౌలిక సదుపాయాలు, ఇతర సామగ్రి గురించి అడిగి తెలుసుకున్నారు. మరణించిన దాత కిడ్నీ, గుండె కోసం గుర్తింపు పునరుద్ధరణ కోసం, ఊపిరితిత్తులు, లైవ్ డోనార్ కిడ్నీ మార్పిడి విషయాలపై ఆరా తీశారు. బృందం వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని ఉన్నారు.

వైఎస్ జగన్ మేలు మరువలేనిది

- ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీ తీర్మానంపై వాల్మీకి నాయకుల హర్షం

ఆత్మకూరు: బోయ/వాల్మీకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేలు మరువలేనిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వాల్మీకి రిజర్వేషన్‌పోరాట సమితి నాయకులు కొండన్న, రామ్ భీమ్‌నాయుడు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రి తమను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. ఇందుకు వాల్మీకులందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. గతంలో తాము ఎస్టీ రిజర్వేషన్ కోసం పలు ఉద్యమాలు చేసినా పాలకులు పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేశారన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు పట్టణంలో ఏప్రిల్ 2వ తేదీన భారీ ర్యాలీ, కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వాల్మీకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బోయలక్ష్మమ్మ, బోయరాముడు, బోయ శంకర్, మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణ, వాల్మీకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ తీర్మానంపై కృతజ్ఞతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకి/ బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడం పట్ల వీఆర్‌పీఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం సుభాష్ చంద్రబోస్, ప్రధాన కార్యదర్శి జి. రాంభీంనాయుడు, ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న, విద్యార్థి నాయకులు మహేంద్ర తదితరులు మర్యాదపూర్వకంగా సజ్జలను కలిశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ... రాష్ట్రంలోని ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, విజయవాడ జిల్లాల్లోని వాల్మీకులను కూడా ఎస్టీలుగా గుర్తించేందుకు కృషి చేయాలని సజ్జలకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.


సజ్జలకు వినతి పత్రం అందిస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

వాల్మీకి కృతజ్ఞత సభను జయప్రదం చేద్దాం

ఆలూరు: వాల్మీకి/ బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా వచ్చే నెల 2వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. అట్టడుగు వర్గాలకు చెందిన వాల్మీకి కులస్తులకు సీఎం రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ ఇలా పలు పదవులు లభించాయన్నారు. సీఎం తమకు అన్ని విధాలుగా అండగా నిలబడుతున్న నేపథ్యంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మేలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కర్నూలు (టౌన్): మే 1తవ తేదీ నుంచి 31 వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల నిర్వహణకు జిల్లాలో ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న వారు, సీనియర్ క్రీడాకారులు, 6 వారాల ఎన్‌ఐఎస్ సర్టిఫికెట్ పూర్తి చేసుకున్న వారు, వ్యాయామ ఉపాధ్యాయులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 4 వ తేదీలోపు అర్హతలు, క్రీడాంశం, వేదిక, క్రీడా సామగ్రి తదితర వివరాలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మలుపులో కాటేసిన మృత్యువు

- బైక్, కారు ఢీ, ఇద్దరు దుర్మరణం
- మృతులిద్దరూ నంద్యాల వాసులు



మృతి చెందిన నరసింహులు, షేక్ ఇలియాజ్

గడివేముల: రహదారిలో మలుపు వద్ద మాటేసిన మృత్యువు ఇద్దరిని పొట్టనపెట్టుకుంది. గడివేముల – నంద్యాల రహదారిలో తిరుపాడు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నంద్యాల రైల్వేలైన్ గూడ్స్‌షెడ్ ప్రాంతానికి చెందిన నరసింహులు (42) హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం గడివేముల చేరుకుని మూలపెద్దమ్మను దర్శించుకుని నంద్యాలకు ఎక్సెల్ బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో నంద్యాల నుంచి గడివేముల వైపు వస్తున్న కారు తిరుపాడు వద్ద ప్రమాదకర మలుపులో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు, బైక్ పొలాల్లోకి దూసుకెళ్లాయి. దీంతో బైక్‌పై ఉన్న నరసింహులు, కారులో ఉన్న నంద్యాలకు చెందిన ఇలియాజ్ (62) అక్కడికక్కడే మృతి చెందారు. బేకరి వ్యాపారం చేసే ఇలియాజ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరో ముగ్గురు స్నేహితులతో కలసి కారులో నందికొట్కూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్నేహితులు ముగ్గురు ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం లెక్కింపు

మంత్రాలయం రూరల్: శ్రీరాఘవేంద్రస్వామి మఠం హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. మార్చి నెలలో 27 రోజులకు సంబంధించి మొత్తం రూ. 2,11,95,988 సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కరెన్సీ రూ. 2,07,39,068 ఉండగా నాణేలు రూ. 4,56,920, బంగారం 7 గ్రాములు, వెండి 571 గ్రాములు ఉన్నట్లు వెల్లడించారు.

వ్యాపారస్తులు తప్పులు దొర్లకుండా చూడాలి



మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ టి.శేషాద్రి

కర్నూలు(హాస్పిటల్): వ్యాపారస్తులు తమ ట్రేడింగ్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ టి.శేషాద్రి చెప్పారు. వాణిజ్యపన్నుల శాఖ కర్నూలు డివిజన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలోని సమావేశ మందిరంలో ట్రేడ్ అడ్వయిజరి మీటింగ్ నిర్వహించారు. ఇందులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో పాటు వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు, ఆడిటర్స్, అకౌంటెంట్స్ పాల్గొని వారి సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా టి.శేషాద్రి మాట్లాడుతూ శాఖలో ఇటీవల కాలంలో వచ్చినమార్పుల గురించి సమగ్రంగా వివరించారు. ఉప కమిషనర్ పి. సురేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జీఎస్‌టిలో వచ్చిన మార్పుల గురించి తెలియజేశారు. సాధారణంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఇలాంటి సమావేశాల వల్ల చాలా ఉపయోగకరమైన విషయాలు తెలుస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు(టౌన్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక బుధవారపేటకు చెందిన జశ్వంత్(24) తన మిత్రుడు వసంత్‌తో కలసి పని నిమిత్తం మామిదాలపాడుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడింది. ఈ సంఘటనలో జశ్వంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. వసంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ఇటీవల చైనా దేశంలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. తల్లి విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతి విషయం తెలుసుకున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.


రోడ్డు పైనే వదిలిన రాళ్ల గుట్టలు

ఎంత చెప్పినా 'వ్యర్థమే'

కొలిమిగుండ్ల: నాపరాతి గనుల్లోని వ్యర్థాలను రహదారి వెంట గుట్టగుట్టలుగా వదిలేస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గనుల యజమానులకు అవగాహన కల్పిస్తున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. బెలుం-బెలుం శింగవరం, మదనంతపురం-చింతలాయిపల్లె, బందార్లపల్లె ప్రధాన రహదారుల వెంట వ్యర్థాలను వేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. రహదారికి సమీపంలోనే గనుల తవ్వకాలు జరుపుతుండటం, ఆ పక్కనే వ్యర్థాలను పడేస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రాత్రి వేళ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మైనింగ్ పూర్తయి, వృథాగా ఉన్న గనుల్లో వ్యర్థాలను నింపితే ప్రయోజనం వుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


బెలుం-బెలుం శింగవరం రోడ్డులో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు